సేవలు వెలవెల!

- సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- మొరాయిస్తున్న సర్వర్లు.. తెరుచుకోని వెబ్‌సైట్లు
- సేవలు అందక ప్రజలకు తప్పని ఇక్కట్లు



కల్లేపల్లి గ్రామ సచివాలయం

శ్రీకాకుళం రూరల్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన గ్రామ/వార్డు సచివాలయాలు ఒకప్పుడు కళకళలాడుతుండేవి. ఏ పథకం వర్తించాలన్నా.. ఏ పని పూర్తి కావాలన్నా సంబంధిత సచివాలయ సిబ్బంది వద్దకు వెళ్తే క్షణాల్లో పని జరిగేది. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాలు వెలవెలబోతున్నాయి. పూర్తిస్థాయిలో సిబ్బంది ఉంటున్నా సాంకేతిక కారణాలతో ఏ పనీ జరగని పరిస్థితి నెలకొంది.

గతమెంతో ఘనం..

గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు వేలు జనాభా దాటిన ప్రతి పంచాయతీలోనూ సచివాలయం ఏర్పాటు చేశారు. దానిలో వివిధ శాఖలకు సంబంధించి ఉద్యోగులను నియమించారు. గ్రామస్తులకు అవసరమైన ప్రతి పనీ అక్కడే జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో సచివాలయం వ్యవస్థ ఎంతో విజయవంతమైంది. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా సచివాలయ వ్యవస్థ నిర్వీర్యమవుతోంది. ఇక్కడ అందే సేవలకు సైతం కోత విధిస్తోంది.

తెరుచుకోని వెబ్‌సైట్లు..

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడుస్తున్నా సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సక్రమంగా సేవలు అందడం లేదు. రేషన్ కార్డుల నమోదు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డు సేవలు, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ వంటివి వెబ్‌సైట్లలో నమోదు కావడం లేదు. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను కుదేలు చేసిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేస్తోంది. కేవలం కుల ఆదాయ ధ్రువపత్రాలు, వన్‌బీలు తప్ప ఇతర ముఖ్యమైన సేవలు అందకపోవడంతో సచివాలయాలకు వెళ్తున్న సామాన్య ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థపైనా, ఆ శాఖలో పనిచేసిన ఉద్యోగులపైనా కూటమి నాయకులు నానా విమర్శలు చేసేవారు. నేడు వారితోనే సామాజిక పింఛన్ల పంపిణీతో పాటు ఇటీవల 'ఇది మంచి ప్రభుత్వ పాలన' అంటూ స్టిక్కర్లను ఇంటింటికి అంటించే బాధ్యత కూడా సచివాలయ ఉద్యోగులకే కట్టబెట్టారు. కార్యాలయంలో ముఖ్యమైన పనులు వదిలేసి ఇలాంటివి తమతో చేయించడం తగదని పలువురు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెనక్కి వచ్చేశా..



నేను ఇటీవల అనారోగ్యానికి గురయ్యాను. ఆస్పత్రికి వెళ్తే ఆరోగ్యశ్రీ కార్డులో పేరులో తప్పు ఉందని, సచివాలయంలో సరిచేసుకొని రావాలని హాస్పిటల్ సిబ్బంది చెప్పారు. వెంటనే సచిలయానికి వెళ్లాను. అక్కడ వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని సిబ్బంది చెప్పడంతో వెనక్కి వచ్చేశాను. డబ్బులు వెచ్చించి చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది.

– ఎస్.రాజారావు, భైరివానిపేట

నిలువెత్తు నిర్లక్ష్యం



రణస్థలం మండల కేంద్రంలోని వెలుగు, ఎన్ఆర్‌జీఎస్ ఉమ్మడి భవనంపై మొలిచిన మొక్కలు నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా కనిపిస్తున్నాయి. కార్యాలయం వెనుక భాగంలో గోడల్ని తొలిచేసే మర్రి, రావి చెట్టు వంటి మొక్కలు పెరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. వీటిని ఇలానే వదిలేస్తే లక్షలాది రూపాయలు విలువైన భవనం పగుళ్లు వచ్చి దెబ్బతినడం ఖాయం.

– రణస్థలం

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..



పాత్రునివలస టిడ్కో కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. ఒకప్పుడు ఈ భవనాన్ని కోవిడ్ సేవలకు వాడేవారు. తర్వాత దీనిని పట్టించుకోవడం మానేశారు. దీంతో రాత్రివేళ మందు, విందులకు నిలయంగా మారింది. మున్సిపాల్టీ యంత్రాగం స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. – శ్రీకాకుళం రూరల్

ఎండుతున్న పంటలు



ఎచ్చెర్ల మండలంలో వరి పంటలు ఎండుతున్నాయి. వర్షాలు అనుకూలించక, నారాయణపురం కుడికాలువ ద్వారా సాగునీరు రాక రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో తొమ్మిది గ్రామ పంచాయతీల్లో ఈ దుస్థితి నెలకొంది. కనీసం పశుగ్రాసానికి సైతం పంట పనికి రాకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. – ఎచ్చెర్ల క్యాంపస్

కథ 'కంచె'కేనా?



జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్డును ఆనుకుని పలుచోట్ల ఇనుప కంచెలు ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాలు నియంత్రణ, వాహనచోదకులు, పాదచారులు సర్వీస్ రోడ్డు నుంచి లోపలకు రాకుండా వీటిని అమర్చారు. అయితే పలు సందర్భాల్లో భారీ వాహనాలు ఢీకొట్టడంతో కింతలి మిల్లు తదితర ప్రాంతాల్లో కంచె పాడైంది. తర్వాత వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

క్లుప్తంగా

జి.సిగడాం డీటీగా నిర్మల

జి.సిగడాం: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా ఎస్.నిర్మల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రాధిక కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

దత్తత హక్కులపై అవగాహన

ఎచ్చెర్ల: లావేరు మండల వెలుగు కార్యాలయంలో మండలస్థాయి ఎస్‌హెచ్‌జీ సభ్యులకు జిల్లా బాలల రక్షణ విభాగం అధికారులు ఐ.జనార్ధన, ఏ.గీత శుక్రవారం దత్తత ప్రక్రియ అర్హతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనధికారంగా పిల్లలను దత్తత తీసుకుంటే చట్టపరమైన దత్తత హక్కులు సంక్రమించవని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరాజు, ఏపీఎం సుబ్బయ్యనాయుడు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి


గ్రంథాలను ఆవిష్కరించిన దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని గ్రంథాలయాల పరిపుష్టికి గ్రంథాలయ అధికారులు తోడ్పాటు నందించాలని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజా అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం లైబ్రేరియన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం గ్రంథాలయాలకు కథా నిలయం పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కొరియాలో తైక్వాండో శిక్షణ


గ్రాండ్ మాస్టర్ లీ డాంగ్‌సన్‌తో జిల్లా తైక్వాండో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్జాతీయ స్థాయిలో తైక్వాండో శిక్షణలో సిక్కోలు క్రీడాకారులు భాగస్వామ్యమయ్యారు. శిక్షణ పూర్తిచేసుకుని శ్రీకాకుళం జిల్లాకు చేరుకున్నారు. వీరిని తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రతినిధులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు అభినందించారు. ఈ శిక్షణకు శ్రీకాకుళం నగరం నుంచి కొమర మోహన్‌కృష్ణ, కారె మోక్షిత్, కారే సాక్షిత్ ఎంపికయ్యారు. నెలరోజులపాటు జరిగిన ఈ శిక్షణను పూర్తిచేసుకుని శుక్రవారం జిల్లాకు చేరుకున్నారు.

శాశ్వత ఓటర్లను గుర్తించండి

శ్రీకాకుళం రూరల్: శాశ్వత ఓటర్లను గుర్తించాలని శ్రీకాకుళం తహశీల్దార్ ఎస్.గణపతిరావు బీఎల్‌ఓలకు సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పెషల్ సమ్మరీ రివిజన్–2025 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొత్త ఓటర్లు నమోదులో మృతులు, డబుల్ ఓటర్లను తొలగించాలన్నారు. అభ్యంతరాలు సరిచేసుకునేందుకు నవంబర్ 28 వరకూ వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక ఓటర్ల నమోదు ఉంటుందని తెలిపారు. సమావేశంలో డీటీ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

గార: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే మెసేజ్‌లకు స్పందిస్తే ఆర్థిక నష్టం జరిగే అవకాశాలున్నాయని ఎస్ఐ ఆర్.జనార్దన అన్నారు. శుక్రవారం కళింగపట్నంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు సిబ్బంది పేరిట ఎవరైనా ఫోన్ చేసి వ్యక్తిగత సమాచారాన్ని అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకుసాగాలి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కె.ఆర్.రజని అన్నారు. విశ్వవిద్యాలయంలోని ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్జెక్టుపై పట్టు, విషయ పరిజ్ఞానం, వ్యక్తిత్వ వికాసానికి విద్యార్థులు ప్రాధాన్యమివ్వాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్లు, నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్యపై శిక్షణ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆత్మరక్షణవిద్య ద్వారా మహిళల్లో ఆత్మస్థైర్యం కలుగుతుందని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అన్నారు. కళాశాల ప్రాంగణంలోని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో ఆత్మరక్షణ విద్యపై శిక్షణ తరగతులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పీడీ అరుగుల జ్యోతికుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రోణంకి హరిత, మహిళా సాధికారిత సమన్వయకర్త ఎస్.అరుణకుమారి, ఆత్మరక్షణవిద్య శిక్షకుడు కొమర భాస్కర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌కు సిద్ధం

- శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా బాస్కెట్‌బాల్, మోడర్న్ పెంటాథ్లెన్ పోటీలు
- నేటి నుంచి మూడు రోజులపాటు నిర్వహణ


ఎన్టీఆర్‌ఎంహెచ్‌స్కూల్ క్రీడా కోర్టును పరిశీలిస్తున్న ఎస్‌జీఎఫ్ అధికారులు


కేఆర్ స్టేడియంలో రన్నింగ్‌ట్రాక్‌పై నిర్వహణ కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు వేదికగా రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ సమరానికి సర్వం సిద్ధమైంది. జిల్లా విద్యాశాఖ పరిధిలోని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి మూడు రోజులపాటు శ్రీకాకుళం వేదికగా 68వ ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్‌జిల్లాల) స్కూల్‌గేమ్స్ బాలబాలికల బాస్కెట్‌బాల్ (అండర్–19), మోడర్న్ పెంటాథ్లెన్ (అండర్–17,19) ఛాంపియన్‌షిప్–2024 పోటీలు జరగనున్నాయి. స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ క్రీడామైదానంలో అండర్–19 బాలబాలికలకు బాస్కెట్‌బాల్ పోటీలు, కోడిరామ్మూర్తి క్రీడామైదానం, శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్ వేదికలగా అండర్–17, 19 బాలబాలికలకు మోడర్న్ పెంటాథ్లెన్ పోటీలు జరుగనున్నాయి. డీఈఓ, ఎస్‌జీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య నేతృత్వంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, పీఈటీ సంఘ నాయకులు మొజ్జాడ వెంకటరమణ, మెంటాడ సాంబమూర్తి, సంపతిరావు సూరిబాబు, నిర్మల్ కృష్ణ, శ్రీనివాసరావు, బాస్కెట్‌బాల్ డీఎస్‌ఏ కోచ్ జి.అర్జున్‌రావు రెడ్డి, ఆయా సంఘ ప్రతినిధులు, పీడీలు సమీక్షిస్తున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు జిల్లాకు చేరుకున్నారు. వివిధ జిల్లాల జట్లు/క్రీడాకారులు, కోచ్ మేనేజర్లు, నిర్వాహకులు, సంఘ ప్రతినిధులు, టెక్నికల్ అఫీషియల్స్, పీడీ, పీఈటీలు కలిపి 600 మంది వరకు ప్రాతనిధ్యం వహిస్తున్నారు.

విజయవంతం చేయాలి: జిల్లా ఎస్‌జీఎఫ్

స్కూల్‌గేమ్స్ రాష్ట్ర పోటీలను విజయవంతం చేయాలని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, కార్యదర్శి బడి వెంకటరమణ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం నుంచి ఎదావిధిగా క్రీడా ఈవెంట్స్/పోటీలు మొదలుకానుండగా.. ఆదివారం ఉదయం 10 గంటలకు అధికార ప్రజాప్రతినిధులు ఇచ్చిన షెడ్యూల్ నేపథ్యంలో ప్రారంభోత్సవం జరగనుందని ఎస్‌జీఎఫ్ అధికారులు తెలిపారు.

మత్తుతో జీవితం చిత్తు

శ్రీకాకుళం క్రైమ్: డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు అలవాటుపడవద్దని శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని గొంటివీధి, దమ్మలవీధిల్లో శుక్రవారం ఒకటో పట్టణ, రెండో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ చంద్రకళ హౌసింగ్ బోర్డు కాలనీలోని టీపీఎం స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒకటో పట్టణ ఏఎస్ఐ రామారావు దమ్మలవీధిలో అవగాహన సదస్సు నిర్వహించారు.

జి.సిగడాం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని జి.సిగడాం ఎస్ఐ వై.మధుసూదనరావు సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడిపందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

11 నుంచి 'మన గుడి'

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి మన గుడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఎం.లలితామణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా కిల్లిపాలెం ఉమా సహిత కైలాస ఈశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 11 నుంచి 17 వరకు బంకుపల్లి రమేష్‌శర్మచే కార్తీకమాస విశిష్టతపై ఉపన్యాసాలు, 15న కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు.

కులగణన జరిగాకే ఎస్సీ వర్గీకరణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కులగణన జరిగాకే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని రెల్లికుల, ఉపకులాల జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి మోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అలా జరిగితేనే 13 రెల్లి ఉపకులాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

మినీ గోకులాలపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లో మినీ గోకులాల నిర్మాణాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఎచ్చెర్ల ఎంపీడీవో ఎస్.హరిహరరావు అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ ఫీల్డు అసిస్టెంట్లు, గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులతో ఉపాధి హామీ పథకం కార్యాచరణ ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు, నాలుగు, ఆరు ఆవుల పెంపకానికి రూ. 1.50 లక్షలు, రూ.1.85 లక్షలు, రూ.2.30 లక్షల అంచనాలతో గోకుల షెడ్‌లు నిర్మించేందుకు నిధులు మంజూరవుతాయని చెప్పారు. సమావేశంలో డ్వామా ఏపీడీ లోకేష్, ఉపాధి ఏపీఎం ఎస్.శోభాదేవి పాల్గొన్నారు.

భూముల పరిశీలన

జి.సిగడాం: మండలంలోని బాతువ గ్రామానికి చెందిన టి.నారాయణరావు అనే రైతు భూసమస్యలపై ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ సర్వే పరిశీలకులు అనుపోజు వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ మెట్ట శ్రీరామమూర్తి, మొయ్యి ఈశ్వరరావు, ఆర్ఐ రాధ, వీఆర్‌ఓ పాట్నూరు జగన్నాథం భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీ సర్వే చేసిన గ్రామాల్లో ఎక్కడైనా తప్పులు ఉంటే వాటిని పరిష్కరిస్తున్నామని చెప్పారు.

11న చట్టాలపై వర్క్‌షాప్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో విద్యార్థులకు ఈ నెల 11న క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో చట్టాలపై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు విశాఖ రీజియన్ అడిషనల్ ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్ కాజల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు.

అలరించిన 'పార్వతీ కల్యాణం' హరికథ


భాగవతారిణి శిఖామణిని సత్కరిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ, మావుడూరు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మూడురోజుల సంగీత కార్యక్రమాలు శుక్రవారం బాపూజీ కళామందిర్‌లో ప్రారంభమయ్యాయి. ముందుగా రామచంద్రాపురానికి చెందిన భాగవతారిణి యండమూరి శిఖామణిచే 'పార్వతీ కల్యాణం' హరికథా గానం జరిగింది. సూర్యప్రసాదరావు మృదంగం, వయొలీన్‌పై దుంపల ఈశ్వరరావు వాద్య సహకారం అందించారు. కొండలరావు శాక్సోఫోన్ కచేరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో పులఖండం శ్రీనివాసరావు, బందారు చిట్టిబాబు, డాక్టర్ పి.మాలతి, డాక్టర్ సోమేశ్వరరావు, మావుడూరు శ్రీనివాసరావు, ఇప్పిలి శంకరశర్మ, మావుడూరు సత్యనారాయణ, మండా శ్రీనివాసరావు, చిట్టి వేంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలతో జీవితం నాశనం


మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని శ్రీకాకుళం న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. చిలకపాలెంలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'మాదక ద్రవ్యాలు వినియోగం–యువత జీవితాలపై ప్రభావం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు మందులు, ధూమపానం, మద్యపానం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ ఫ్రీ క్యాంపస్‌లు లక్ష్యంగా యాజమాన్యాలు ముందుకు సాగాలన్నారు. యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు రాము, మాధురి, విజయరాజ్ కుమార్, రాణి, ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు పయనం


తైక్వాండో క్రీడాకారిణులతో వర్సిటీ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: పంజాబ్‌లోని అమృతసర్ గురు నానక్‌దేవ్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 12 నుంచి 15 వరకు జాతీయ స్థాయి అంతర విశ్వవిద్యాలయాల తైక్వాండో మహిళల పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్సిటీ పరిధిలోని ముగ్గురు క్రీడాకారిణులు ఎల్.జగదీశ్వరి (శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల), ఎ.భువనేశ్వరి (శ్రీ వెంకటేశ్వరా కాలేజ్ ఆఫ్ ఫార్మశీ, ఎచ్చెర్ల), యు.అఱు (ఆదిత్య డిగ్రీ కళాశాల, ఇచ్ఛాపురం) ఎంపికయ్యారు. వీరు శుక్రవారం పయనం కావడంతో.. విజయంతో తిరిగి రావాలని వీసీ రజిని ఆకాంక్షించారు. టీమ్ కోచ్‌గా లక్ష్మణరావు శ్రీకాకుళం వ్యవహరిస్తున్నారు.

పారా యోగా పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ)లో ఇంజినీరింగ్ రెండో ఏడాది చదువుతున్న ఎం.తేజేశ్వరరావు, కె.డార్విన్, పి.శైలేష్‌బాబు జాతీయ స్థాయి పారా యోగా పోటీలకు అర్హత సాధించారు. నేషనల్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ సంస్థ ఆన్‌లైన్‌లో నిర్వహించిన స్క్రీనింగ్ పోటీల్లో వీరు మెరుగైన ప్రదర్శన చేశారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ అభినందించారు.

శతశాతం అక్షరాస్యతే లక్ష్యం


రణస్థలం: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సాయికుమార్

రణస్థలం: కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలఅక్షరాస్యత శాతశాతం ఉండాలని వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి సాయికుమార్ అన్నారు. రణస్థలం మండల పరిషత్ కార్యాలయంలో వీవోఏ, ఎంపిక చేసిన వలంటీర్ల ఉల్లాస్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు అక్షరాస్యతతో పాటు ఆరోగ్యం, పోషకాహారం, నైపుణ్య అభివృద్ధి, పెంపొందించాలని ఈ పథకం ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ధనుంజయరావు, ఏపీఎం ఎం.మాధవీలత, ఏపీవో శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లో సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా ఉల్లాస్ వలంటీర్లు ముందుకు సాగాలని వెలుగు మండల ఏపీఎం రత్నం అన్నారు. ఎచ్చెర్ల మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం సమాజంలో అందరికీ జీవితకాల అభ్యసన అవగాహన (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అనే అంశంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోజన విద్యాశాఖ లక్ష్యాలు నెరవేర్చేలా వలంటీర్ టీచర్లు కృషి చేయాలన్నారు. అనంతరం రిసోర్సుపర్సన్లు కార్యాచరణ ప్రణాళిక వివరించారు.

జి.సిగడాం: విద్యతోనే మహిళలు మరింత అభివృద్ధి చెందుతారని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు జి.లక్ష్మి, ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణరావు, ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, మాస్టర్ ట్రైనర్ కిల్లారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: లావేరు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఉల్లాస్ శిక్షణ తరగతులను ఎంపీడీఓ పి.వెంకటరాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో వయోజన విద్యా సూపర్‌వైజర్ రమణమ్మ, సీసీలు ఆసిరినాయుడు, విజయకుమారి, రమేష్, జానకి, పెంటయ్య, అకౌంటెంట్ శ్రీదేవి, సీవో మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

వర్సిటీలో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: అంబేడ్కర్ వర్సిటీ విద్యార్థులకు శుద్ధ జలాలు అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వీసీ కె.ఆర్.రజని అన్నారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను వీసీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్సిటీలో పూర్తిస్థాయి సౌకర్యాలపై దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణతో నైపుణ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఫౌండేషనల్ లిటిరసీ అండ్ న్యూమరిసి (ఎఫ్‌ఎల్‌ఎన్) శిక్షణా తరగతులతో ఉపాధ్యాయులలో భాషా ఉచ్ఛారణ, గణిత నైపుణ్యాలపట్ల ప్రావీణ్యత లభిస్తుందని పాఠశాల విద్య ఆర్జేడీ(విశాఖపట్నం) బి.విజయభాస్కర్ అన్నారు. విశ్వవిజేత జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణా తరగతులను శుక్రవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు కల్పన, డీఈఓ తిరుమల చైతన్య, సమగ్రశిక్ష ఏఎంఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జయహో జగన్నాథ..!


రథయాత్రలో పాల్గొన్న భక్తులు

రణస్థలం: మండలంలోని కోష్ట గ్రామ సమీపంలో శ్రీకృష్ణ చైతన్య మఠం గోసేవ ఆశ్రమం త్రిదండి స్వామి కేశవ మహరాజ్ ఆధ్వర్యంలో రణస్థలం మండల కేంద్రంలో శుక్రవారం గోపాష్టమి సందర్భంగా సందర్భం జగన్నాథ, సుభద్ర, బలరాముల రథయాత్ర ఘనంగా నిర్వహించారు. భారీగా భక్తుల హాజరై ఊరేగింపులో పాల్గొన్నారు. శనివారం గోశాలలో అన్నదానం జరగనుందని, భక్తులంతా హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.